# సన్నాయి సదానందం

"ఒరేయ్ శీనూ... మన సదానందం ఊళ్లోకొచ్చాడట్రా. ఓసారి అటు వెళ్దామా?"

"సదానందం ఎవడ్రా!"

"చెరువుగట్టు సెలూన్ బాలయ్య కొడుకురా..."

"ఎవడు? ఆ బాలిగాడి కొడుకా??"

"అవున్రా- మన్తోబాటు ఏడోక్లాసు దాకా చదివాడు... సదానందం అనీ గుర్తులేదా?"

"ఓ- ఆ... సద్దుగాడా? సద్దూ- నల్లటి మొద్దూ- సదూలు వద్దు- కత్తెర తెద్దూ- కట్టింగ్ చేద్దూ- అని పాటకట్టి ఏడిపించేవాళ్లం కదా- వాడేనా?"

"ఆ... ఆ సద్దూనేరా... సదానందం..."

"ఏడోక్లాసు పరీక్షలు రాయకుండా బడి మానేసి, మెడ్రాసు వెళ్లిపోయాడు కదా! అక్కడ ఎన్టీఆర్ కట్టింగూ, ఏయన్నార్ కట్టింగూ, శోభనీబాబు క్రాఫింగూ నేర్చుకుంటున్నాడని ఆడి బాబు బాలిగాడు చెప్పేవాడు కదా- అయ్యన్నీ నేర్చుకొచ్చాడా?"

"ఛీ! నోర్ముయ్. వాళ్లందరివీ విగ్గులు- టోపీ పెట్టుకున్నట్లు- జుట్టుపెట్టేసుకుంటారు"

"అవునా... మరి ఈడు ఆ టోపీల్లోపలుండే వాళ్ల జుట్టు గీకేస్తాడా ఏంటీ?"

"ఒరేయ్ ఎటకారం వొద్దు! నువ్ ఎదుటివాళ్ల గొప్పతనం వొప్పుకోవ్! ఇంకోళ్లు చెప్పేమాట పూర్తిగా వినవ్!! మనం ఏడోక్లాసు చదువుతున్నప్పట్నుంచీ సద్దూ... అంటే నాకు ఇష్టంరా. వాడు నాలాగా ఎలిమెంట్రీ స్కూలు మాస్టరో- నీలాగ కిరాణాకొట్టు ఓనరో అవుతాడని నేను అనుకోలేదు."

"మరి? కత్తెర లేకుండా జుట్టు కట్ చేసే ట్రిక్కు కనిపెడతాడను కున్నావా? కత్తి లేకుండా గెడ్డం గీసేసే మగత్యం సూపిస్తాడనుకున్నావా? ఏడో క్లాసులో సదువు ఆపేసినాడు. కత్తులూ కటార్లూ పట్టుకుని జమ్మరో ఝూమ్మని- భారత రాట్రపతికి ఆత్థాన మంగలి అయిపోతాడను కున్నావా?"

"శీనూ... అలా వెటకారంగా నవ్వకు. సదానందం స్కూల్ మానేసిన కథ నీకు తెలీదురా..."

"కథా? ఓ.... సెప్పు... కామెడీ ఉంటుందా"

"వెర్రి వెధవా! ప్రతీ కథలోనూ కామెడియో, ట్రాజిడీయో ఉండదు! జీవితం ఉంటుంది!! అది నవరసాలకీ అతీతమైన జీవితం- ఏ రసం ఏదో తెలియని జీవితం. ఆ జీవితం కథ విను!"

✦ ✦ ✦

సదానందం వాళ్ల నాన్న చెప్పినట్లు ఏడో క్లాసులోనే చదువు మానేసి, గెడ్డం గీయటంలో కటింగ్ చేయడంలోనో తర్ఫీదు పొందలేదు. వాళ్ల నాన్న బాలయ్య బడి మాన్పించినా... సద్దూ ఆయన చెప్పే పాఠాలు వంటపట్టించు కోలేకపోయాడు. సద్దూకి కటింగ్ మీదా షేవింగ్ మీద ఆసక్తి లేదు. బడి మానెయ్యగానే పంజరం వీడిన పక్షిలా ఎగురుతూ వాళ్ల తాతయ్య ముందు వాలేడు. వాళ్ల తాత అంటే... ముసలి సదానందం, కరణం గారికీ, పూజారిగారికీ, మునసబు గారికీ రోజూ వెళ్లి గెడ్డం గీసే మంగలి. పంట రాగానే మూడు బస్తాల వడ్లు వతనుగా ఇస్తారు. అంతకుముందు గుళ్లో పుట్టువెంట్రుకలు తీస్తే నెలకు 150 రూపాయలు వచ్చేవి గానీ... పెద్ద సదానందం తమ్ముడు ఆ హక్కులు లాక్కుని గుడిలో క్షురకర్మకి ఆధిపత్యం సంపాదించాడు. దాంతో ఆ ఆదాయం పోయింది. అప్పుడూ అప్పుడూ పెళ్లిళ్లకీ శుభకార్యాలకీ సన్నాయి వాయిద్యానికి వెళ్లేవాడు. కానీ... ఆ రోజులు మారి బేండు వాయిద్యం వచ్చింది. సన్నాయి పాటకన్నా బేండుమేళమే ఆకర్షణీయం అయింది.

సన్నాయితోబాటు సదానందం కూడా మూలపడుతున్నాడు. సదానందం కొడుకు బాలయ్య మాత్రం తండ్రిలా కాక డబ్బు బాగా

సంపాదించాలనే ఆలోచనలతో చెరువుగట్టున సెలూన్ ఓపెన్ చేశాడు. ఆ సెలూన్ పెట్టాక ఆదాయం కూడా బావుంది. ఇంకా ఈ సెలూన్‌లో పట్నాల్లో ఉండేలా మెత్తటి కుర్చీలూ- చుట్టూ అద్దాలు ఏర్పాటు చేయాలని బాలయ్య ఆశయం. చిన్న సదానందాన్ని కూడా ఈ వృత్తిలో దింపాలని, తనంతవాడిని చేయాలని తాపత్రయం. బాలయ్య కోరిక తీరట్లేదు.

అక్కడ కథ మారింది. సద్దూకి తాతగారి సన్నాయి వాద్యం బాగా గొప్పదని నమ్మకం కుదిరింది. తాతయ్య ముత్తుస్వామి, త్యాగరాయ కీర్తనలు, అన్నమయ్య గీతాలు, పెళ్లిపాటలూ, దాంట్లో ముహూర్తం పాటలూ, తలంబ్రాల పాటలూ అన్నీ సన్నాయిలో పలికిస్తుంటే ముగ్ధుడైపోయి మహదానందం పొందేవాడు. చిన్న సదానందం చాలసార్లు ఆ పెళ్లిళ్లకి హార్మనీపెట్టి (లాగడానికి) వాయించడానికి వెళ్లేవాడు. ఆ సంగీత ప్రపంచంలో మునిగిపోవాలని నిర్ణయించుకున్నాడు సద్దూ. బాలయ్యకి కొడుకు అభిప్రాయం ఏమాత్రం నచ్చలేదు.

"నీ సన్నాయి పొయ్యిలో పెడతాను. నీలాగే వాడి బతుకు నాశనం చేయకు" అంటూ తండ్రిని నానా తిట్లు తిట్టేవాడు. కానీ... తాతా మనవల బంధాన్ని, సంగీత బాంధవ్యాన్ని ఆయన తుంచలేకపోయాడు.

ఆ తండ్రీ కొడుకుల అగాథం మధ్యలో చిన్న సద్దూ తత్తరపడి పోయాడు. బలవంతంగా తన తండ్రితో పాటు సెలూన్‌కెళ్లినా తండ్రి మెప్పుని పొందేలా తన కులవృత్తిలో ఇమడలేక పోయేవాడు. బాలయ్యకి తీరని బెంగే! రోజూ తండ్రితో తను చేసే పనికి చివాట్లు తింటూ మధ్యంతరంగా ఇంటికి వచ్చేసేవాడు సదానందం.

ఇంటికొచ్చాక తాత ఆయన గురువు. ఆయన దగ్గర స్వర మాధురులూ, సంగీత సారస్వతాలూ తెలుసుకుంటూ అభ్యాసం చేస్తూ

మురిసిపోయేవాడు.

బాలయ్యకి పూర్తిగా నిర్ధారణ అయ్యింది- తన తండ్రే కొడుకుని అనవసరమైన దారిలోకి లాగుతున్నాడని, వీలైనంత తండ్రిని తిట్టేవాడు. కొడుకుని కొట్టేవాడు. ముసలాయనికి... ఓపిక తగ్గుతోంది. వయసు, అస్త్రాద్రికి క్రుంగుతోంది. చిన్న సదానందం... తండ్రి- వృత్తి మధ్య సతమత మవుతూ ఎటువైపు మొగ్గు చూపాలో తెలియని స్థితిలో ఉంటున్నాడు. కానీ ముక్కారణంగా సంగీతాన్ని వళ్లంతా పట్టించు కున్నాడు సద్దూ. గొంతులో మననం చేశాడు. మనస్సునే సన్నాయి చేసి స్వర విన్యాసం చేశాడు. అలా త్రికరణ శుద్ధిగా సన్నాయి నాదంలో తల మునకలవుతుండగా తాతగారు అంటే పెద్ద సదానందం మరణించాడు.

మరణించే ముందు దాకా ఊపిరిని వ్యర్థపరచకుండా సన్నాయిని పూరించడానికి వినియోగించాడు. ఆయాసంతో శృతి శుద్ధంగా వాయువుని సన్నాయికి వాడాడు. ఆ సన్నాయిని పూరించలేక పోతున్నప్పుడు నోటి నుంచి సన్నాయి తీసి... రొప్పుతూ... మనవడి చేతికి అందించాడు. ఆ తర్వాత ఆయన ఊపిరి సద్దూకి చేరిందో లేదో తెలీదు కానీ చనిపోతున్న తాత చేతి నుంచి సన్నాయి అందింది. తాత గారు చనిపోయిన నాడే హఠాత్తుగా సద్దూ మాయమైపోయాడు.

తండ్రి పోయినందుకు కాదుగానీ కొడుకు పారిపోయినందుకు కొన్నాళ్ళు వెతికి, వెతికి బెంగపడ్డ బాలయ్య అడిగినవాళ్లకి సద్దూని మెడ్రాస్ ట్రైనింగ్‌కి పంపించానని బెంగని దిగమింగి చెప్పేవాడు! అందరూ నమ్మారు. కానీ... ఇప్పుడు... వెళ్లిపోయిన పదేళ్లకి మళ్లీ సద్దూ వచ్చాడు- కాదు, సదానందం వచ్చాడు. ఊళ్లోకి సదానందం వస్తున్న విషయం అందరికీ ముందే వార్త వచ్చింది. సద్దూగాడు వస్తున్నాడంటే నాన్న గుండెల్లో ఆనంద రాగాలు వెల్లివిరిశాయి. నిజానికి వస్తున్నది సద్దూగాడు

కాదు. భారత సంగీత చరిత్రలో సన్నాయి వాద్యంలో ఎనలేని కీర్తి ప్రతిష్టలూ, గౌరవాలూ సాధించుకున్న సదానందం. ఎందరో ఏకలవ్యులకి గురువుగా, మరెందరో సన్నాయి వాద్య కళాకారులకి ఏకలవ్య శిష్యుడిగా ఎదిగిన 30 ఏళ్ల సదానందం- సన్నాయి సదానందం.

+ + +

"ఒరే మనం కూడా వెళ్దాంరా! మన సద్దూయే ఆ సదానందం అని... నాకు తెలియదు" అన్నాడు శీను. ఫ్రెండ్స్ ఇద్దరూ వెళ్లారు. సద్దూని చూడ్డానికి కుదర్లేదు. ఆయనకూడా అయిదు కార్ల నిండా జనం వచ్చారు. సద్దూ తండ్రి ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. సద్దూ వస్తూనే తండ్రి సెలూన్ దగ్గర కారు ఆపి దిగాడు. తండ్రికి కన్నీళ్లు!! ఇంటికొచ్చి అమ్మ కాళ్లకి దణ్ణం పెట్టాడు. అమ్మకి కన్నీళ్లు!! తాతగారి గదిలోకి వెళ్ళాడు. వెండి తాపడం చేసిన పెట్టెలో తాత వాయించిన సన్నాయి తెరిచాడు. ఎవరికీ వినిపించని రాగం సదానందానికి వినిపించింది. అదే రాగం అందరికీ వినిపించేలా ఆలపించాడు- చుట్టూ ఉన్నవాళ్లు ఆనందంతో కళ్లనీళ్లయి పోయారు. ఆ పారవశ్యంతో బాలయ్య పులకించిపోయాడు.

"ఒరేయ్... సద్దూ... కాదు సదానందం... మా నాన్న నీ ఊపిరిలో... నీ వేళ్లలో బతికే ఉన్నట్లు ఉందిరా... నాన్నా!"

ఏమిటో చెప్పబోయాడు. గొంతులో దుఃఖం అడ్డొచ్చి గొణుక్కున్నాడు- కాదు దాచుకున్నాడు- కానీ అతని భాష కన్నీళ్ల అక్షరాలతో అక్షంతలయ్యాయి.